# లోక విద్య ప్రపంచం

పక్షపత్రిక

లోకవిద్యాధరుల గొంతు

సంపుటి-1, సంచిక-4 16-నవంబరు - 2013 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2

## ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రజాస్వామ్యం పేరుతో అమలును పారదర్శక వ్యవస్థ నిర్మాణంతో వ్యతిరేకించాలి

మనదేశాన్ని సార్వభౌమ్య, సామ్యవాద, లౌకిక ప్రజాస్వామ్య గణరాజ్యమనీ, పౌరులెల్లరకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయంను, భావం, భావ ప్రకటన, విశ్వాసము, ధర్మము, ఆరాధన వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోను, అవకాశములోను సమానత్వమును చేకూర్చుటకు మరియు వారందరిలో వ్యక్తి గౌరవమును, జాతీయ ఐక్యతను, అఖండతను తప్పక ఒనగూర్చు, సౌభ్రాత్రత్వమును పెంపొదించుటకు భారత సంవిధానమును వ్రాసుకున్నాము. దీని అర్థం ప్రజలందరికీ ఆర్థిక, అభివృద్ధి అవకాశాల్లో, సమానత్వం కల్పించటం ద్వారానే మిగతా సమానత్వాలన్నీ కల్పించటం సాధ్యపడుతుందని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. ఆంధ్రప్రదేశ్ జనాభా 8.5 కోట్లు. మన రాష్ట్రంలో 2 కోట్ల కుటుంబాలకు పైగా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయని తెల్ల రేషన్ కార్డులు యివ్వడం ద్వారా కుటుంబానికి 4గురు చొప్పున 8 కోట్లమంది పైగా దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని నిర్లజ్జగా 67 సంవత్సరాల స్వతంత్ర భారతావనిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించుకోవటానికి దారితీసిన పరిస్థితులను విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ఎన్నికల్లో పాల్గొనే ప్రజానీకం తమందర్నీ దారిద్ర్యరేఖకు దిగువన ఉంచే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటోందా? అసలీ ఈ దారిద్ర్యరేఖ నిర్వచనం ఏమిటి? తెల్లరేషన్ కార్డులు ఎవరికి యిస్తారు. యింకా రచ్చబండలో లక్షలాది మంది తెల్లకార్డుల కోసం ఎదురు చూస్తున్నారంటే ఆంధ్రప్రదేశ్‌లో అంతా దారిద్రమేనా? మనల్ని అందర్నీ దరిద్రులు అనడానికి ఈ ప్రభుత్వానికి యీ హక్కు నెవరిచ్చారు? ఈ విషయాలు తెలుసుకోవాలంటే ముందుగా ఈ ప్రభుత్వ లెక్కలన్నీ తప్పుడు లెక్కలనీ, దారిద్రరేఖ దిగువనున్న వారి సంఖ్య పెరగడానికి కారణం, అనర్హులకు పెద్ద ఎత్తున పాలక ముఠా బిస్కెట్లుగా విసురోతందని ఎవరికైనా అర్థంగాక తప్పదు. ఈ వ్యవస్థలో ప్రజలందరూ ఓట్లువేసినా పదే పదే ఒకే స్వభావం కలిగిన నాయకులు వివిధ పార్టీల పేరుతో గెలిచినా ఈదేశ వనరులను పంచుకుంటున్నారని, ఒక ప్రక్క కుబేరుల జాబితా మనదేశంలో రెండు మూడు దశాబ్దాలుగా త్వరితగతిని పెరుగుతోందని జగమెరిగిన సత్యం. దీన్నే ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారీ విధానం అంటారు. వారు ఆ సంపదతో పదేపదే ఎన్నికవుతూ వస్తున్నారు. ఆకర్షణీయమైన తెల్లరేషన్ కార్డుల పథకం, ఆరోగ్యశ్రీ కార్డు పథకం, ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం, ఉచిత విద్యుత్ పథకం, పనికి ఆహార పథకం, ఇళ్ళ పట్టాల పంపిణీ పథకంతో పాటు సబ్సిడీలు సబ్‌ప్లాన్‌లు, ఇందిరమ్మ ఇళ్ళు, సర్టిఫికెట్ల ద్వారా సమాజంపై ఓటర్లకు గాలంవేసి పట్టుసాధించారు. ఈ రోజు ప్రభుత్వం అంటే పన్నులు వసూలు చేసి, ప్రజోపయోగార్థం ఖర్చు చేసే సంస్థగా గాక, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆ ముఠా కంపెనీలకు పన్నులలో రాయితీల ద్వారాను, సహజవనరులను కారుచౌకగాను ఒక ప్రక్క యివ్వడంతోపాటు కాంట్రాక్టర్ల పేరుతో ప్రజాపనుల శాఖ ద్వారా కోట్లాది రూపాయలు కొద్దిమందికి కూడబెట్టే ఒక వ్యవస్థగా తయారు చేశారు. ఈ విశ్లేషణ చేసేవారు పదవిలోకి వచ్చి కొత్త ముఠాకట్టి ఎలా దోచుకోవాలనే ఆలోచన చేసే పద్ధతి ప్రవేశపెట్టి మొత్తం రాజకీయాలంటేనే అసహ్యించుకునే స్థితికి చివరగా జాతి మొత్తం నిర్వీర్యమయ్యే స్థితికి తీసుకొచ్చారు. ఈ చీకటిలో కాంతిరేఖలే అక్కడక్కడ దీనిని ప్రశ్నించే స్థానిక నూతన నాయకత్వాల ఆవిర్భావం. ఇటువంటి నూతన నాయకత్వాలను పెరగకుండా ప్రస్తుత ముఠా నాయకత్వాలు, యువ నాయకత్వం, నూతన జవ సత్వాలు, కొత్తనీరు, నవతరం, యువభారతం పేర్లతో అభివృద్ధి కాముకుల్నందర్నీ ఉచ్చులోకి లాగే ప్రయత్నంలో భాగమే రాబోయే ఎన్నికలు. పెద్ద ఎత్తున కొత్త ముఠాలకు తావు కల్పిస్తూ చివరగా అదే ముఠాను మళ్ళీ ప్రజాస్వామ్యం పేరుతో ఎన్నుకోవాలనీ వీరు కోరుకుంటున్నారు. తద్వారా ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారీ విధానాన్ని అమలు జరుపుతారు.

### కారుచీకటిలో కాంతి రేఖ :

ప్రజాస్వామ్యం పరిడవిల్లాలంటే, సమానత్వం కావాలంటే పారదర్శకత అత్యావసరం. పారదర్శకత అంటే ఎవరైనా, ఏదైనా ఒక పని, లేదా సేవ, లేదా ఒక సర్టిఫికేట్, కావాలంటే స్థానిక ముఠా నాయకుడునో, సర్పంచ్‌నో, శాసన సభ్యుడునో, పార్లమెంటు సభ్యుడనో, అధికారినో ఆశ్రయిస్తేగాని తెలిసే పరిస్థితి వైదొలగించటమే పారదర్శకత. ఉదాహరణకు తెల్లరేషన్ కార్డు కావాలంటే ఏమి చెయ్యాలి అన్నది ప్రభుత్వం ఉద్యోగ వర్గానికి చెబితే అర్హులైన వారందరికి కార్డులు ఇవ్వకపోయినా అర్హత లేనివారికి కార్డు ఇచ్చినా నిర్ధాక్షణ్యంగా ఉద్యోగుల మీద చర్యలు తీసుకోవాలి. ఇది జరగాలంటే తెల్లరేషన్ కార్డులు యివ్వడానికి అర్హతలను ప్రభుత్వం ప్రకటించి, అందరికీ అర్థమయ్యే భాషలో బహిరంగ పరచాలి. తెల్లకార్డులదారులందరి పేర్లు ఇంటర్‌నెట్‌లో పెడితే గ్రామ పౌరులే అర్హత లేనివారికి తెల్లకార్డులు ఇచ్చిన అధికారుల భరతం పడతారు. అర్హత కలిగిన వారికి కార్డులు ఇవ్వటానికి పదేపదే తిప్పించుకునే అధికారుల మీద బాధితుడు ఎన్నికైన వారికో, అధికార్లకో, మండల, లేదా జిల్లా, లేదా రాష్ట్ర స్థాయి న్యాయసేవాసంస్థకో ఫిర్యాదు చేసి న్యాయం పొందగలుగుతారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డు అర్హతలు, ఉచిత ఇంటిపట్టా మంజూరు చేయడానికి అర్హతలు, ఉచిత విద్యుత్‌కు అర్హతలు. పనికి ఆహార పథకానికి అర్హతలు, ప్రకృతి విపత్తు రాయితీ ఇవ్వడానికి అర్హతలు. పంటల భీమా పథకం పొందడానికి అర్హతలు ప్రభుత్వం ఈనాటిదాక అందరికీ అర్థమయ్యే సరళభాషలో పారదర్శకంగా పెట్టలేదని, దీనివల్లనే పాలక ముఠా సభ్యులు ఆశ్రితులకు మాత్రం సేవలను అందిస్తూ పదే పదే ఎన్నికవుతున్నారని ప్రజలందరూ గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత ప్రభుత్వ చట్టాలకు లోబడి కొన్ని రాయితీలు పొందటానికి షెడ్యూలు కులముల - తెగల, వెనుకబడిన తరగతులు వారికి కులం సర్టిఫికేట్, స్కూలు, కాలేజీల్లో స్కాలర్‌షిప్ కోసం, సబ్‌ప్లాన్ నిధుల నుండి పెట్టుబడుల కోసం ఈ వర్గాలకి ఇవ్వవలసిన కుల ధృవీకరణ పత్రాలను కూడా గ్రామాల వారిగా పారదర్శకంగా వెబ్‌సైట్‌లో ప్రవేశపెడితే ఒక ప్రక్క అధికారుల చుట్టూ తిరిగే బాధలు తప్పడంతో పాటు, దొంగ సర్టిఫికెట్స్ రద్దవుతాయి. 2005వ సంవత్సరంనుండి సమాచార హక్కు చట్టంక్రింద సమాచారం యివ్వని అధికారుల మీద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యీ రోజు వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. యీ అధికారుల మీద ముఠా నాయకులమీద అన్యాయానికి వ్యతిరేకంగా భారతదేశంలో ప్రతీ స్త్రీ, ప్రతీ షెడ్యూలు కులముల, తెగల సభ్యులు, చిన్న పిల్లలు, నిరాశ్రయులు, పారిశ్రామిక కార్మికుడు మొదలైన వారికి ఉచిత న్యాయసేవలు దొరుకుతాయని, ఉచిత న్యాయ సేవా అధికారచట్టం 1987 సెక్షన్ 12 ప్రకారం మండలి, జిల్లా, హైకోర్టు, సుప్రీంకోర్టు స్థాయిలో కూడా ఉచితంగా న్యాయవాదులను అడిగే హక్కుందని మనమందరం గుర్తించాలి.

భారతదేశంలో వ్యక్తిగత సంపాదనకు దొంగతనం చేసినవారికి ఎటువంటి శిక్ష పడుతుందో, పన్ను ఎగవేతదారులకు, అక్రమార్జనా పరులకు వెంటనే అటువంటి శిక్ష పడుతుందనే భయం మన రాష్ట్రంలో లేదు. పన్ను చెల్లించకుండా అధికారులు, ఎగవేతదారులు పంచుకుంటున్నారు. చెయ్యని పనిని చేసినట్లు రికార్డులు చూపి అధికారులు కాంట్రాక్టర్లు డబ్బు పంచుకుంటున్నారు. అర్హతలేని వారికి రాయితీలు యిచ్చి, పుచ్చుకున్నవారు, యిచ్చినవారు పంచుకుంటున్నారు. యిటువంటి నేరాలను అరికట్టనంతకాలంల ప్రజాధనం యీ ముఠాలచేతికే చేరుతుందనేది జగమెరిగిన సత్యం. ఈ రోజు అప్పుడప్పుడు ఆరోపణాలపై వచ్చే కోర్టు తీర్పులతో కొద్దిమంది అవినీతి అధికారులు, ముఠా నాయకులు జైళ్ళలో ఉన్నా; మిగతా పట్టుబడని నాయకులు, అధికారులున్నంతకాలం, ఈర్ష్య పడేవారి సంపదను చూసి నిస్సహాయస్థితితో నున్న ప్రజలను రక్షించాలంటే ప్రతి అధికారి, రాజకీయనాయకుడు, ఆదాయం వ్యయాలను పారదర్శకంగా వెబ్‌సైట్‌లలో పెట్టాలి. ప్రతీ పత్రంలోనూ వ్యక్తి పేరుతోనూ, ఫోటోతోనూ ఆధార్ సంఖ్య వెయ్యటం తప్పనిసరి చేస్తే బినామీ లెక్కలన్నీ బయటపడతాయి. లెక్కకు మించి ఉన్న ఆస్తులను బహిరంగ వేలంలో అమ్మి ప్రభుత్వ ఖజానాకు జమ చెయ్యాలి. ఎన్నికైన ప్రజాప్రతినిధుల, ప్రభుత్వ అధికారుల కుటుంబాలకు ఉచితంగా వైద్యం ప్రైవేటు వైద్యశాలల్లో చేయించటానికి ఖర్చయిన వేలకోట్ల రూపాయలతో ప్రభుత్వ వైద్యశాలలు కట్టి, నిర్వహణ మెరుగుపరిస్తే ప్రజలంతా ఆరోగ్యశ్రీ కార్డుల కోసం బిచ్చమెత్తే పరిస్థితి తప్పించవచ్చు. అలాగే పై వర్గాలతో పాటు కొన్ని తరగతుల విద్యార్థులకిచ్చే ఫీజు రీయింబర్సుమెంటుకు ఖర్చుచేసిన ప్రైవేటు కళాశాలలకిచ్చిన కోట్లరూపాయలతో ప్రభుత్వ విద్యాశాఖ వారికింద అనేక ఇంజనీరింగు, వైద్య విద్యాకళాశాలలు నెలకొల్పవచ్చు. ప్రైవేటు కళాశాలలకీ, వైద్యశాలలకీ ప్రభుత్వం ద్వారా ఒక్క రూపాయి ఇచ్చినా వారు ప్రభుత్వ సంస్థలను బ్రతకనీయరు. పన్ను ఎగవేత దారుడితో పాటు దానికి సహకరించిన అధికారిని కూడా వెనువెంటనే శిక్షించాలి. వీటిని బహిరంగ పరిచిన పౌరులకు భారీ ప్రతిఫలం ముట్ట చెబుతామంటే కొన్ని వందల, వేల మంది యువత తెగించి సత్యాన్వేషణకు నడుంకడతారు. అటువంటి కార్యరూపం దాల్చేదాక మన రాష్ట్ర యువత సమాచార హక్కు చట్టంద్వారా న్యాయసేవ చట్టం ద్వారా, వ్యక్తిగతంగాను సేకరించిన గ్రామానికి సంబంధించిన విషయాలను గ్రామంలో బహిరంగంగాను, సభలు సమావేశాల ద్వారా ప్రజలందరియొక్క దృష్టికి తీసుకురావడం ద్వారా లోక కళ్యాణంలో భాగస్వాములవగలుగుతారు. ప్రజాసేవలో ఉన్న ఎన్నికైన, ఓడిన అభ్యర్థులతో పాటు ప్రతీ ప్రభుత్వోద్యోగి ఆస్తి వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టేటట్లు, ప్రభుత్వ ప్రతిసేవకీ కాలనిర్ణీతి వ్యవధిలో చేయని అధికారులను నిర్ధాక్షిణ్యంగా తొలగించటం ద్వారా నేరం చేయటాన్కి భయపడే వ్యవస్థను నిర్మించవచ్చు.

చివరి మాటగా భారతీయ సాంప్రదాయంలో పురాణాన్ని పెద్దలు చనిపోయినప్పుడు పురోహితుడు చదివి విన్పించటం పరిపాటి. దేనికంటే ఉన్న వాళ్ళు బ్రతికినంతకాలం చేసిన తప్పులకు మరణానంతరం మరిగే నూనెలో వేయటం, పాములచే కరిపించటం క్రిందినుండి శూలాన్ని పంపటం, దుర్గంధమైన కుళ్ళిన మరిగే రక్త సముద్రంలో వేయటం పురుగులతో కూడిన పదార్థాలని తినిపించటం వగైరా భయంకర చిత్రహింసలకు గురికావలసివస్తుందని తెలుపుతోంది. వీటిలో అలాగే బైబిల్, ఖురాన్ కూడా మనం చేసే ప్రతీ తప్పుకీ ఇక్కడ శిక్షలు తప్పించుకున్నా చనిపోయిన తర్వాతనైనా శిక్షపడుతుందని చెప్తున్నాయి.

ఈనాటి ఆర్థిక నేరస్తులు రాజకీయ నాయకులుగా పెరిగి మాఫియాగా ప్రజల్ని శాసిస్తుంటే, ప్రజలు సామూహికంగా కదిలి బహిరంగంగా ఆర్థిక నేరస్తులను శిక్షించే చట్టం తెస్తే తప్ప వేరు మార్గంలేదు. ప్రజల కోపాగ్నికి, ఆగ్రహానికి గురవుతామన్న భయం కలిగించకుండా ఈ చర్యలను నిరోధించలేం. ఇదంతా విస్తృత ప్రచారం ద్వారా పారదర్శక వ్యవస్థను నిర్మించటంలోనే ప్రస్తుత ఆశ్రితపక్షపాత పెట్టుబడిదారీ విధానాన్ని నిర్మూలించగలుగుతాము.

- నారాయణరావు

# జన్యుమార్పిడి ఆహారం వాడకంవలన క్షీణిస్తున్న ప్రజల ఆరోగ్యం - విధ్వంసకర జన్యు పంటల ఉత్పత్తిని వ్యతిరేకించండి

సహజంగా పెరిగే విత్తనాలు కాక మొక్క దశలోనే చెట్టులో పురుగు నిరోధక మందును ప్రవేశపెట్టడం ద్వారా అధిక ఉత్పత్తి, రసాయనిక ఎరువుల వాడకం తగ్గి రైతులకు అధిక లాభాలు లభిస్తాయని మోన్‌సాంటో కంపెనీ, ఈ కంపెనీకి వంతపాడే శాస్త్రజ్ఞులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. మోన్‌సాంటో కంపెనీ మనదేశంలోని పాలకులను, ప్రభావితం చేసి ఇక్రిసాట్, వ్యవసాయ విశ్వవిద్యాలయాల ద్వారా దేశంలో దొడ్డిదారిన 17 రకాల జన్యు మార్పిడి విత్తనాలను ప్రవేశపెట్టేందుకు భారత ప్రభుత్వం ఆమోదం పొందేందుకు ప్రయత్నిస్తోంది.

జన్యుమార్పిడి విత్తనాలు ప్రవేశించిన 17 సం॥ల అనంతరం ప్రపంచంలో 5 బిలియన్ల హెక్టార్ల సాగుభూమిలో 170 మి.హె. అనగా 3.4 శాతం వ్యవసాయ భూమిలో మాత్రమే జన్యు విత్తనాల వ్యవసాయం అవి 4 పంటలలోనే సోయా, జొన్న, పత్తి, కనోలా. అమెరికా 40.8% , బ్రెజిల్ 21.40%, అర్జెంటినా 14.03% ఈ 3 దేశాల్లో 76 శాతం ఈ విత్తనాలనుపయోగించి పండిస్తున్నారు. కెనడా 6.8 శాతం, ఇండియాలో 6.30 శాతం, చైనా 2.34 శాతం, మరో 22 దేశాలలో 8.33 శాతం భూమి సాగులో వుంది.

చైనాలో జన్యుమార్పిడి బియ్యం వాడకంవలన ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో, జన్యుమార్పిడి పంటలపై ఆంక్షలు విధించి చైనా ప్రయోగశాలలో పరీక్షించకుండా వాడినందుకు చైనా ప్రభుత్వం వ్యవసాయ అధికారులను శిక్షించింది.

అమెరికాలో చార్లెస్ బెన్‌బ్యాక్, వాషింగ్టన్ యూనివర్సిటీ శాస్త్రజ్ఞుడి పరిశీలన ప్రకారం జన్యుమార్పిడి వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గినా హెర్బిసైడ్ వాడకం పెరిగింది. పత్తి పంటలో 99శాతం జన్యుమార్పిడి పంటలో బి.టి. టాక్సిన్ ఉత్పత్తి అవుతోంది. జన్యు వృక్షంలో బి.టి. టాక్సిన్ ఉత్పత్తి అయి ప్రతీ అణువులోనూ వుంటోంది.

అమెరికాలోని పర్యావరణ శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం అనేక జంతువుల పై జరిగిన ప్రయోగాలను బట్టి ఆస్తమా, ఎలర్జీలు, మంటలు, పునరుత్పత్తి సమస్యలు, పుట్టుక లోపాలు, క్యాన్సర్, నరాల నిస్సత్తువ, ఆటిజం వంటి వ్యాధులకు దారితీస్తుందని తమ పరిశీలనలో తేలిందని పేర్కొన్నారు.

ఫ్రెంచి మాలిక్యులర్ బయాలజిస్ట్ జి.ఇ. సెరాలిని ప్రకారం హెర్బిసైడ్ నిరోధక మైదా వాడకంవలన ఎలుకలు త్వరగా చనిపోవడం, ఎలుకల్లో క్యాన్సర్ లక్షణాలు కన్పించాయని 2012 నివేదికలో తెల్పింది.

జన్యుమార్పిడి పంటల ప్రభావాలపై 400 మంది శాస్త్రజ్ఞులు తమ అధ్యయన వివరాలను సైన్స్ పత్రికలలో వ్యాసాలుగా ప్రచురించారు. అమెరికాలో ప్రతి కంపెనీలో వాటా ద్వారా మోనోసాంట్ కంపెనీలకున్న వీటో అధికారాన్ని ఉపయోగించి ఈ వాస్తవాలు బయట ప్రపంచానికి తెలియకుండా అణచిపెడుతున్నారు.

డా.జె. ప్రీస్మిత్ పరిశీలన ప్రకారం ఎలుకల్లో వ్యాధినిరోధక శక్తి తగ్గడం, కిడ్నీవాపు, లివర్ నిక్రోసిస్, రక్త క్యాన్సర్, రక్తలోపం, రక్తవత్తిడి, చక్కెరవ్యాధి, సోయాబీన్స్ వాడకంవల్ల ఆహార ఎలర్జీలు, ఎలుకల్లో పిల్లలు పుట్టకపోవడం జరుగుతున్నాయని పేర్కొన్నారు. అమెరికన్ అకాడమీ పర్యావరణ వైద్యం (ఎఎఇయం) శాస్త్రవేత్తలు ఫిజిషియన్లకు తమ రోగులను జెనటిక్ ఆహారాన్ని త్యజించమని బోధించమని పిలుపిచ్చింది.

ఓహియో అలర్జిస్ట్ డా. జాన్ బయోల్స్ ప్రకారం సోయ ఎలర్జీ కేసులు అనేకం వస్తున్నాయని, దీనికి కారణం జన్యుమార్పిడి సోయా వల్లనే వస్తోందని ఇది చాలా ప్రమాదకరమని, ప్రజలు సోయా జన్యు ఆహారం తినవద్దని తెలిపారు.

ప్రపంచ ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త పుష్పా ఎమ్. భార్గవ ప్రపంచంలోని 600 సైన్స్ పత్రికలలోని వ్యాసాలను సమీక్షించి జన్యు మార్పిడి ఆహారంవల్ల అమెరికన్ల ఆరోగ్యం క్షీణిస్తోందని పేర్కొన్నారు.

జీవశాస్త్రవేత్త డేవిడ్ స్క్యూబర్ట్, స్టాక్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం జన్యు ఆహారంవల్ల పిల్లలపై టాక్సిన్ ప్రభావం వల్ల కడుపుతో ఉన్నబాలింతలకు అధిక ప్రమాదం అని, ఆహారం సరిగ్గా జీర్ణం కావడంలేదని, సరైన పరిశోధనలు జరగకపోవడంవలన పిల్లలు పరిశోధనలో చనిపోయే 'గినియాపిగ్'లుగా మారుతున్నారని వాపోయాడు.

ప్రయోగశాలలో ఎలుకలకు సోయా ఆహారం ఇవ్వడం వలన ఆడ ఎలుక పిల్లలు 3 వారాలలో చనిపోయాయని పేర్కొన్నారు. మగ ఎలుకలకు సోయా ఇస్తే వాటి వృషణాలు గులాబీ రంగు నుండి నీలం రంగుకు మారాయి. ఎలుకలో డి.ఎన్.ఎలలో గణనీయమైన మార్పులు వచ్చాయి.

అమెరికాలో జన్యుమార్పిడి జొన్న తిన్న పందులలో పునరుత్పత్తి దెబ్బతిందని రైతులు వాపోయారు.

జన్యుమార్పిడి గోధుమ విత్తనాల వలన అమెరికన్ రైతులు భారీగా నష్టపోయారని, దీర్ఘకాల వివాదం ద్వారా బాయర్ క్రాప్‌సైన్స్ సంస్థ 750 మిలియన్ డాలర్ల నష్ట పరిహారం చెల్లించాల్సి వచ్చింది. జన్యుమార్పిడి విత్తనాల ద్వారా వ్యవసాయం చేసి, ఈ ఆహారం వలన తలెత్తిన అనారోగ్య సమస్యలపై అమెరికాలో జరిపిన పరిశోధనలు, పరిశీలనలు అమెరికన్ ప్రజలు అనేక రకాల వ్యాధులకు గురవుతున్నారని శాస్త్రజ్ఞులు చెబుతుంటే, ఈ వాస్తవాలను అణగదొక్కి, వెనకబడిన మనలాంటి దేశాలలో విత్తన మార్కెట్‌లో ప్రవేశించి జన్యుమార్పిడి విత్తనాల వలన అధిక ఉత్పత్తి వస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. జాతి ఉనికే ప్రశ్నార్థకం చేస్తున్నారు.

భారతదేశంలో పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ, వ్యవసాయం రంగంపై జన్యుమార్పిడి విత్తనాల ప్రభావంపై 2 1/2 సం॥ల కాలంలో దేశం అంతా పర్యటించి శాస్త్రవేత్తలను, రైతులను కలిసి ఆగస్టు 9, 2012న 492 పేజీల నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం జన్యుమార్పిడి విత్తనాల అమలు వల్ల అనేక నష్టాలున్నాయని తమ పరిశీలనలో తేలిందని తెలిపారు.

మహారాష్ట్రలోని యావత్‌మల్, విదర్భ జిల్లాలలో ప్రజలతో జరిపిన బహిరంగ చర్చలో బి.టి. కాటన్ రైతుల పరిస్థితి బాగా లేదని, వర్షపాతం వున్న ప్రాంతంలో అత్యధిక రైతుల ఆత్మహత్యలు జరిగాయని వీరంతా బి.టి. పత్తి సాగుచేసిన రైతులేనని పేర్కొంది.

బహిరంగ ప్రయోగాల వలన వాతావరణ కాలుష్యం, అనారోగ్యకర పరిస్థితులు తెలత్తాయని, పంజాబ్, హర్యానాలో జన్యుమార్పిడి ప్రయోగాలను తక్షణం ఆపివేయమని తీర్మానించింది.

సుప్రీంకోర్టు ద్వారా నియమించిన సాంకేతిక నిపుణుల బృందం బి.టి. పత్తి ప్రయోగాలను 10 సం॥ల పాటు నిర్వహించరాదని అక్టోబర్ 17, 2012న మధ్యంతర నివేదిక విడుదల చేసింది.

ఈ విధంగా ప్రపంచంలో అనేక దేశాలలో శాస్త్రజ్ఞులు వినియోగదారుల బృందాలు, రైతులు జన్యుమార్పిడి పంటల ఆహార వినియోగం వలన వస్తున్న అనారోగ్యం, పర్యావరణ ప్రమాదాలపై హెచ్చరిస్తుంటే, భారతదేశంలోని కేంద్ర, రాష్ట్ర పాలకులు ప్రభుత్వానికి, కంపెనీలకు అమ్ముడుపోయిన శాస్త్రజ్ఞులు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారు.

దేశంలో స్వతంత్రులైన శాస్త్రజ్ఞులతో పరిశోధనలు జరిపి నిర్ధారించకుండా జన్యుమార్పిడి విత్తనాల అమలుకు ప్రజలు అనుమతించకూడదు. విత్తనం ప్రవేశపెట్టే కంపెనీ నష్టాలకు బాధ్యత వహించే విధంగా చట్టాన్ని సవరించాలి. అమెరికాలో వినియోగదారులు కోర్టులలో కేసులు వేసి బిలియన్ డాలర్ల నష్ట పరిహారాన్ని పొందినట్లే, మనదేశంలో రైతులు వినియోగదారులు కూడా లబ్ధిపొందే విధంగా విత్తన చట్టాన్ని సవరించాలి. విదేశీ కంపెనీలలో భారత ప్రభుత్వం చేసుకునే ఒప్పందాలు వివాదాలు ఆదేశ కోర్టులలో తేల్చుకోవాలనే నిబంధన ఉండడంతో మన ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోంది. భోపాల్ గ్యాస్ లీక్ సందర్భంగా మన అనుభవం అదే. అలాకాక దొడ్డిదారిన ఈ విత్తనాలను ప్రవేశపెడ్తే రైతులు అడ్డుకుని జన్యుమార్పిడి విత్తనాలను తిరస్కరించాలని విత్తనం స్వయంప్రతిపత్తి కొరకు రైతులే ముందుకు వచ్చి విత్తనంపై సర్వాధికారం రైతులదేనని చాటాలి. మన ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని దెబ్బతీసే జన్యు మార్పిడి విత్తనాలను, ఆహారాన్ని ఎట్టి పరిస్థితులలోనూ ఆమోదించకూడదని రైతులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**కె.జె. రామారావు**

> జ్ఞానం ఏ ఒక్కరి సొత్తు కాదు. ఇతరులను దోచుకోవటానికి పనికొచ్చేది జ్ఞానం కాదు.

# ఉద్యమ వార్తలు

**మోనోసాంటో వ్యతిరేక ప్రచారం**

ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో ఈ సంవత్సరం అక్టోబరు 2 నుండి 12 తేదీ వరకు జన్యుమార్పిడి పంటలకు వ్యతిరేకంగా మోనోసాంటో కేంద్రంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. దాన్లో భాగంగా ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక, రైతు స్వరాజ్య వేదిక, లోకవిద్యజనాందోళన, సదరన్ యాక్షన్ జెనెటిక్ ఇంజనీరింగ్ మొదలుగు సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని రాజకీయ పార్టీలతో, మేధావులతో, కార్యకర్తలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి భారతదేశంలో జన్యుమార్పిడి పంటలు నిషేధించాలని ప్రభుత్వానికి మహజరు సమర్పించడం జరిగింది. ట్యాంక్‌బండ్‌పై నిరసన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. అనంతరం నిజాంకాలేజీలో జన్యుమార్పిడి పంటల వలన జరిగే నష్టాలపై లఘుచిత్ర ప్రదర్శన-చర్చ జరిగింది. చివరి రోజు అక్టోబర్ 12, 2013 వివిధ బహుళజాతి సంస్థలు పెద్ద పెట్టుబడిదారీ కంపెనీలున్న ప్రాంతాల గూండా సైకిల్ ర్యాలి బయలుదేరి పటాన్‌చెరువులోని ఇక్రిసాట్ ముందు బహిరంగ సభతో ముగిసింది.

**ప్రకాశం జిల్లా కారంచేడు రైతులతో లోకజనాందోళన సభ్యుల చర్చలు 16, అక్టోబరు 2013న**

లోకజనాందోళన సంస్థ జన్యుమార్పిడి విత్తనాల వల్ల మానవులకు, పక్షులకు, పశువులకు, పర్యావరణానికి వచ్చే ప్రమాదాల గురించి చర్చించి స్థానిక వంగడాలను రైతులే ఉత్పత్తి చేసుకుని వాటిని రక్షించుకోవడం ద్వారానే గ్రామీణ ప్రాంతంలో విత్తన స్వావలంబన పున:ప్రతిష్టించాలని, దీన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని చర్చా గోష్టిజరపడం జరిగింది. ఈ చర్చలో లోకసత్తా నాయకులు ఇమ్మాన్యుయేల్, చేనేత జన సమాఖ్య నాయకులు మోహనరావు, సి.పి.ఐ. నాయకులు నూతి లక్ష్మయ్య లోకవిద్య ప్రపంచం సంపాదకులు నారాయణరావు, కె.జె. రామారావులు పాల్గొని జన్యుమార్పిడి పంటల వల్ల రాబోయే ప్రమాదాలపై వివరించారు.

**రైతుల ప్రాతినిధ్యంలేని అంతర్జాతీయ వ్యవసాయ సదస్సు**

నవంబరు మొదటి వారంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల మద్దతుతో హైదరాబాద్‌లో ప్రపంచ వ్యవసాయ ఫోరం 3 రోజుల అంతర్జాతీయ సదస్సు జరిపిన సంగతి అందరికి తెలిసిందే. ఈ సదస్సులో 300 మంది 33 దేశాల వారు వ్యవసాయం గురించి చర్చించినా మనరాష్ట్ర వ్యవసాయదారులకు ప్రాతినిధ్యం లేదని, వ్యవసాయం, భూమి గురించి చర్చలేకుండా విత్తనాల గురించి, ధరల గురించి, పేటెంట్ హక్కుల గురించి చర్చలు సాగాయని, వ్యవసాయ పరికరాల కంపెనీల వస్తువులమ్ముకునే ప్రదర్శనగా మిగిలిపోయిందని ప్రకృతి వైపరీత్యాల వల్ల, పనికిరాని విత్తనాల వల్ల, వ్యాపారస్తులు, కంపెనీల మోసాల వల్ల రైతులు నష్టపోవడాన్ని చర్చించడం ఏ మాత్రం జరగలేదు. ఈ మధ్య వచ్చిన వరదలు, తుఫానుల నష్టాన్ని గూర్చి చర్చించడం కూడా జరగలేదు. ఈ సమావేశాన్ని నిరసిస్తూ వివిధ రంగాల మేధావులు ఈ క్రింది తీర్మానం చేయడం జరిగింది.

1. ప్రజలు, ముఖ్యంగా చిన్న, మధ్య తరగతి రైతుల ప్రవేశాన్ని నిషేధించినందుకు నిర్వాహకులు రైతులకు క్షమాపణ చెప్పాలి.
2. ఇటువంటి సదస్సులకు భవిష్యత్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎటువంటి సహాయ సహకారాలు అందించరాదు.
3. నాసిరకం విత్తనాలకు కారణమైన కంపెనీలను శిక్షించడంతో పాటు, ఆవిత్తనాలవల్ల అధిక వర్షాలు, వరదలు, తుఫాన్‌లవల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి.
4. ఈ సదస్సుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఖర్చుచేసిన వివరాలను ప్రకటించాలి.

**- లోకజనాందోళన-ఎపి**

# భారత రాజ్యాంగం ప్రాథమిక హక్కులలో లోకవిద్యాధరులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలి.

ఈ మధ్య ప్రజల సాధికారత, మహిళల సాధికారత గ్రామీణ ఉపాధి హామీ, ఆహార భద్రత, విద్యాహక్కు మరియు ప్రకృతి వనరుల రక్షణ మొదలైన చట్టాల గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతోపాటే తెల్లరేషన్ కార్డు, దారిద్ర్యరేఖ, ఆధార్ కార్డు, కాపీరైట్ పేటెంట్ చట్టం, సమాచార హక్కుచట్టం, భారత నాణ్యత ప్రమాణాల మీద కూడా చట్టాలు చేయబడ్డాయి. ఈ సందర్భంలోనే లోకజనాందోళన దేశవ్యాప్తంగా లోకవిద్యాదరులందరికి ఉద్యోగ భద్రత చట్టం కల్పించి వృత్తి విద్యలను రక్షించాలని, తమశక్తి మేరకు పనిచేసే ప్రతీ వ్యక్తికి తనకు నైపుణ్యం వున్న పనిచెయ్యడానికి హక్కు కల్పించడం ద్వారా లోకవిద్యాధరులందరికి ఉద్యోగ భద్రత కల్పించాలని, అడవిప్రాంతం నుండి, తమ భూముల నుండి రైతులను, గిరిజనులను బలవంతంగా వెళ్ళగొట్టడం నేరమని ప్రచారం చేయడం జరుగుతోంది.

ఈ రోజు నూతన శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధిను పయోగించి పెద్ద పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే పెట్టుబడిదారీ విధానాన్ని దాన్లో ఆశ్రితులకు మాత్రమే స్థానం కల్పించే విధానాన్ని ప్రశ్నించడం జరుగుతోంది. ఈ పెట్టుబడిదారీ విధానంలోంచి పుట్టింది సంక్షేమ పథకాలు. వీటిద్వారా లోకవిద్యాధరులు తమ కార్యకలాపాల నుండి దూరం చేయబడుతున్నారు. మానవ జీవితాన్ని ఉన్నత ప్రమాణాలకు తీసుకువెళ్ళడంతోపాటు అందరికి ఉపాధి కల్పించే స్థానిక ఉత్పత్తి విధానాన్ని వ్యతిరేకిస్తూ పోయిన 200 సం॥లుగా వ్యక్తి లాభాల కోసం పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారీ వ్యవస్థను నూతన శాస్త్ర సాంకేతికత పేరుతో ఉత్పత్తి చేయడం జరుగుతోంది. ప్రతీ సేవకు రూపాయలలో విలువ కట్టడం వికృత రూపందాలుస్తోంది. అద్దె గర్భసంచులు దీనికో ఉదాహరణ. భూముల్ని, ఇండ్లని, ఫ్యాక్టరీలను అద్దెకివ్వడం సాధారణ మానవుడు కనిపెడితే గర్భసంచిని కూడా అద్దెకివ్వచ్చని నూతన శాస్త్ర సాంకేతిక విజ్ఞానం చెబుతోంది. ప్రతీ పనిలో నైపుణ్యతకు మానవ విలువలను నశింపచేసి మార్కెట్ విలువలను ప్రవేశపెట్టడం జరిగింది. గాలి, నీరు, తిండి, వాతావరణం మొదలైన చిన్న చిన్న మాటలను పరిశుభ్రమైన గాలి, రక్షిత మంచినీరు, శుచికరమైన భోజనం, కాలుష్యంలేని వాతావరణం అనే పదాలను ప్రవేశపెట్టి ప్రతీ దానికి విలువను రూపాయలలో చెప్పటం జరుగుతోంది.

ఈ ప్రకృతిలో స్త్రీ పురుషుల మధ్య జన్మించే శిశువు ఒక నిర్దిష్ట సమయం తల్లి గర్భంలో పెరిగి ఒక రూపాన్ని సంతరించుకొని ప్రపంచంలో అడుగుపెట్టిన నాడు గాలి, నీరు, తిండి, విసర్జన లక్షణాలను సంతరించుకొంటాడనే లోక జ్ఞానాన్ని మనమంతా కలిగియున్నాం. దీన్ని విడదీసి గర్భంలో వుండే హక్కు, శుభ్రమైన గాలి పీల్చే హక్కు, రక్షిత నీరు తాగే హక్కు, ఆహారపు హక్కు, పరిశుభ్ర వాతావరణంలో విసర్జించే హక్కు వీటన్నింటిని హక్కులుగా వూహించి తయారుచేసిన పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రతీ పనిని రూపాయలలో డాలర్లలో కొలిచే నీచస్థితియని లోకజనాందోళన ప్రగాఢంగా విశ్వసిస్తోంది.

ఉదాహరణకు విద్యా హక్కునే తీసుకుందాం. ఈ చట్టం క్రింద పోయిన 150 సం॥లలో తయారు కాబడిన పాఠశాల, విశ్వవిద్యాలయాల వ్యవస్థలో డిగ్రీలు, సర్టిఫికేట్లు సంపాదించడమే విద్యాహక్కని తద్వారా చిన్నతరహా గాను, పెద్దతరహాగాను, పనివాళ్ళుగా తయారుచేయడమే విద్య అని నిర్ధారిస్తున్నారు. సమాజ నిర్మాణంలో చేనేత, దర్జీ, చాకలి, మంగలి, మేదర, కంసాలి, వడ్రంగి, కుమ్మరి, కమ్మరి, చర్మకారులు, పౌరోహిత్యం, వ్యాపారం, వ్యవహారం మొదలైన విద్యలన్నీ సర్టిఫికెట్లు లేవు కనుక విద్యగా గుర్తించడానికి ఈ చట్టం నిరాకరిస్తుంది. అంటే ఈ చట్టం వృత్తి విద్యలను నాశనం చేయడానికే పుట్టింది.

ఇక రెండో ఉదాహరణ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి పథకం. ఈ దేశంలో ఎవరైనా పారా, పలుగు పుచ్చుకుని నాకు ఉపాది కావాలని అడిగితే సం॥కి నిర్దిష్ట పనిదినాలకు పనికల్పించబడుతుంది. ఈ చట్టంలో వృత్తి విద్యలకు స్థానంలేదు. చివరకు వ్యవసాయానికి కూడా స్థానం లేదు. పెట్టుబడిదారుల వ్యవస్థ కోసం కావాల్సిన పనులకు తగినంత సంఖ్యలో కూలీలను తయారు చేయడమే ఈ చట్టం యొక్క ఉద్దేశ్యం. ఒక్క మాటలో వ్యవసాయ రంగానికి కావల్సిన కూలీలు దొరకకుండా వ్యవసాయరంగాన్ని, నైపుణ్యత కలిగిన వృత్తి విద్యల నుండి బయటపడి కూలీలుగా మారడానికి ఉద్దేశించినదే ఈ పథకం.

ఇక ఆహార భద్రత చట్టానికి వద్దాం. భారత రాజ్యాంగంలోనే పౌరులందరికి ధన, ప్రాణ, మానాలకు భద్రత కల్పించబడింది. దాన్లోనే ప్రాణంతో జీవించడానికి భోజన హక్కు ఇమిడి వుంది. నేటి ఆహార భద్రతా చట్టం ప్రకారం ఆహారాన్ని కొనుగోలు చేసి భారత ఆహార గిడ్డంగుల సంస్థలో పెద్ద ఎత్తున నిల్వచేసి ఎలుకలకు ఆ ధాన్యాన్ని అప్పచెప్పడం తప్ప ఇది పనికొచ్చే చట్టంకానే కాదు. కోట్లాది సం॥ల మానవ జాతి చరిత్రలో గాలికోసం, నీరుకోసం, తిండికోసం, ఏదేశంలోనూ, ఏ ప్రభుత్వం చట్టాలు చేయకపోవడం మనదేశంలో మాత్రమే ఈ చట్టాలు తీసుకురావడం అన్ని పార్టీలు సమర్ధించడం ఆశ్రిత పక్షపాత పెట్టుబడిదారీ ప్రభుత్వ నిర్మాణం కోసమని ప్రజాస్వామ్యం కోసం కానేకాదని లోకవిద్యాధరులందరూ గుర్తెరగాలి.

ప్రకృతి మనకిచ్చిన వనరులతో తరతరాల నుండి వచ్చిన జ్ఞానంతో ప్రకృతితో సహ జీవనం చేస్తూ తమ తమ వృత్తుల ద్వారా సమాజానికి ఉన్నత ప్రమాణాలతో కూడిన జీవనాన్నందించాలనే తపనతో అందరికి ఉపాధి కల్పించే వ్యవస్థతో ఉన్న లోకవిద్యాధర సమాజానికి భారత రాజ్యాంగంలో తమ వృత్తి విద్యకు సరి అయిన పారితోషికం లభించే ప్రాథమిక హక్కు ప్రవేశపెట్టడానికి లోకజనాందోళన సమాయత్తం కావాలి.

అందరికి ఉపాధి, అందరికి సమన్యాయం అనే భారత రాజ్యాంగ పీఠికలోని మార్గదర్శకాన్ని అమలు జరపడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. **- ప్రొ॥ బి. కృష్ణరాజులు**

# చేనేత కార్మిక జనసమాఖ్య రాజకీయ శిక్షణా తరగతులు

15-10-2013న చీరాల జాండ్రపేట చేనేత భవనము నందు చేనేత కార్మిక జనసమాఖ్య ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణాతరగతులు నిర్వహించింది. వూటుకూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో లోకవిద్యాప్రపంచం సంపాదకులు టి. నారాయణరావు మాట్లాడుతూ సాంప్రదాయ చేతి వృత్తులు ఆధునీకరిస్తూ, యాంత్రీకరణ ద్వారా దెబ్బతీస్తున్నారని, చేనేత రంగంలో చేత్తో స్విచ్ వేయటం తప్ప చేతి వృత్తిలేదనీ మగ్గానికి యంత్రం అమర్చి చేనేత నిర్వచనాన్ని మారుస్తున్నారని, ఇది కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కొరకు చేస్తున్నారని పేర్కొన్నారు. మత్స్యకారులను తీరం నుండి తరిమివేసే సూక్ష్మరంధ్ర వలలతో, ట్రాలర్లతో ఆధునిక ఓడరేవులు వస్తున్నాయని, కుటీర పరిశ్రమ ఉపాధి కోసమని, ప్రభుత్వ సహకారం లేకుండా మనుగడ సాగించలేవని, ఈనాటి అభివృద్ధి నమూనా చిన్న వృత్తులను దెబ్బతీసేదిగా వుందని వృత్తుల రక్షణకు, ఉపాధి భద్రతకు అన్ని రంగాల ప్రజలు ఉద్యమంచేయాలని, స్థానిక మార్కెట్లపై ఆధారపడి సంప్రదాయ వృత్తులు మనుగడ సాగించేవైపు కృషి చేయాలని సూచించారు.

చేనేత సంక్షేమ బోర్డు సభ్యులు, నిజాం కళాల అసిస్టెంట్ ప్రొఫెసర్ తడక యాదగిరి మాట్లాడుతూ గత 10 సం॥రాలుగా ఉద్యమంలో మాచర్ల మోహనరావుతో కలిసి చీరాల నుండి ఢిల్లీ వరకు అనేక ఉద్యమాలతో పాల్గొని చేనేతకు అనుకూలంగా పోరాటంలో భాగస్వామినని పేర్కొన్నారు. మీరాసేథ్ కమిటీ; సత్యం కమిటీ సిఫార్సులు చేనేత రంగానికి తీవ్ర నష్టం చేసాయని అనేక సభలు నిర్వహించామని, చేనేత రంగ ఉద్యమంలో ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్ళి సాధన కోసం చేనేత రంగ సమస్యల పరిష్కారం సాధనకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. చేనేత కార్మికుల పోరాటం ద్వారానే సమస్యలు పరిష్కారం మౌతాయని, ఆ పోరాటంలో భాగంగా కృషి చేస్తానని తెలిపారు.

కార్మిక వర్గ దృక్పథంపై కె.జె. రామారావు మాట్లాడుతూ యూరప్‌లో ఆధునిక యంంత్రాలపై ఉత్పత్తిలో పాల్గొన్న కార్మిక వర్గం పెట్టుబడిదారీ వర్గంతో కలిసి రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిందని, ఉత్పత్తిపై పట్టు సాధించి అనంతరం సామాజిక పరిణామ క్రమాన్ని కార్మికవర్గ నాయకత్వంలో విప్లవాన్ని విజయవంతం చేసిందని ఆధునిక కార్మిక వర్గంగా సామాజిక మార్పుకు దోహదం చేసిందని దీన్ని కార్మికవర్గ దృక్పథంగా కారల్‌మార్క్స్ సూత్రీకరించాడని పేర్కొన్నారు.

పారీస్‌కమ్యూన్ పతనానంతరం రష్యాలోని కార్మిక వర్గ పోరాటాలు కార్మిక నాయకత్వాన రష్యన్ సమాజాన్ని విముక్తి చేసాయని, చైనాలో దీనికి భిన్నంగా రైతంగ విప్లవం జరిగిందని తెలిపారు.

భారతదేశంలో జాతీయోద్యమకాలంలో కార్మికవర్గ పోరాటాలు స్ఫూర్తి కలిగించినా, స్వాతంత్ర్యానంతరం దేశంలో విప్లవం పరిపక్వం కాకుండా ప్రభుత్వ రంగంలో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి పరిశ్రమలు ఏర్పరచడం పెట్టుబడిదారులకు ముడిసరుకులు అందించేందుకుద్దేశించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో అనేకమంది కార్మికులకు ఉపాధి లభించడం, సోవియట్ సహకారంతో ప్రభుత్వరంగ అభివృద్ధితో సోషలిస్టు భ్రమలతో కార్మికవర్గ దృక్పథం బలహీనపడింది. సంఘటిత రంగంలో కార్మికవర్గం నాయకత్వం బలహీనపడి పెట్టుబడిదారీ ట్రేడ్‌యూనియన్లు ప్రచారంలోకి వెళ్ళి అర్థికవాదం వైపు కార్మిక ఉద్యమాన్ని మళ్ళించాయి.

ప్రైవేట్ రంగంలో బూర్జువా ట్రేడ్ యూనియన్లు నిర్వహించిన విధ్వంసక పాత్ర బొంబాయి నగరంలోని పరిశ్రమలను వికేంద్రీకరించి ఆధునీకరణకు దోహదం చేసింది. బొంబాయిలో దత్తా సామంత మిలిటెంట్ కార్మికోద్యమం అర్థికవాదం వైపు కార్మికులను ఆకర్షించి ఒక క్రమంలో నిర్వీర్యంచేసి కార్మికులను చెల్లాచెదరు చేసింది. అర్థికవాదాన్ని అధిగమించి కార్మిక వర్గ దృక్పథంతో కార్మికులను సమీకరించి ప్రత్యామ్నాయ ఉద్యమం నిర్మించడంలో కార్మికవర్గ దృక్పధానికి ప్రాతినిధ్యం వహించే శక్తులు విఫలమయ్యారు.

మధ్యప్రదేశ్‌లో రాజహరా ఢిల్లీ ప్రాంతంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన గిరిజన ప్రజలను ఐక్యంచేసి వారిలో మద్యపానాన్ని మానిపించి సంఘటితంచేసి విజయవంతంగా పోరాడిన శంకర్‌గుహనియోగి అనుభవాలు నుంచి కార్మిక ఉద్యమం పాఠాలు నేర్చుకోవల్సి వుంది.

అభివృద్ధి చెందిన దేశాల నుండి సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకుని, ఎప్పటికప్పుడు ఆధునీకరించుకుంటూ, సాంప్రదాయ పద్ధతులకు, మన కాళ్ళపై నిలబడే స్వతంత్ర సాంకేతిక విధానం లోపించిన ఫలితంగా ప్రతీదానికి ఇతరులను అనుకరించడమే తప్ప సృజనాత్మకతకు స్థానంలేని చోట ఆధునిక యంంత్రాలపై, ఉత్పత్తి విధానంపై హద్దులేక అర్థికవాద వూబిలోనుండి బయటపడకుండా కార్మికవర్గ దృక్పథం అభివృద్ధి చెందదు.

భారతదేశంలో కుటీర పరిశ్రమలైన చేనేత రంగంలో ఉత్పత్తి, సాంకేతికతపై పట్టుకలిగిన చేనేత రంగంలో కార్మికవర్గం సహకార వ్యవస్థను బలోపేతం చేసి స్థానిక మార్కెట్‌లో మన ఉత్పత్తులను అమ్ముకోవడం, విదేశీ మార్కెట్‌ను, ఆధునిక యంత్రాల ఉత్పత్తులను నిరోధించడం ద్వారా ఉత్పత్తిలో నాణ్యతను పాటిస్తూ, మార్కెట్‌పై ఆధిపత్యం సాధిస్తే కార్మికులకు ఉపాధి, మార్కెట్ గ్యారంటీ చేయడం జరుగుతుంది. చేనేత కార్మికులు వివిధ పార్టీల మధ్య చీలి, ఐక్యతలేక కార్పోరేట్ మార్కెట్ అభివృద్ధి విధానానికి బలి అవుతున్నారు.

ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా అయిన చేనేత అనుకూల విధానంను ప్రజల సహకారంతో స్థానిక మార్కెట్‌పై మన పట్టును నిలుపుకోవడం సహకార వ్యవస్థ బలోపేతం వైపు నడవడం ద్వారా చేనేత జన సమాఖ్య కృషి చేయాలని పేర్కొన్నారు.

చివరగా భిన్న అస్తిత్వాలకు చేనేత రంగంకున్న సంబంధాలను పేర్కొంటూ దళితులు, వివిధ వృత్తుల వారు సమాజంలో వివక్షను నెదుర్కొంటున్నారని, వివక్షకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో మనం వారికి మద్దతుగా నిలవడం ద్వారా మిత్రులను సంపాదించుకొన్నామని ఇకముందు కూడా ప్రతీ సందర్భంలో పీడిత ప్రజల పక్షం వహించడం ద్వారా సమిష్టిగా ముందుకెళ్ళాల్సి వుంటుందని మాచర్ల మోహనరావు సూచించారు. చీరాల, ఈపురుపాలెం నుండి వేటపాలెం వరకు చేనేత గ్రామాల నుండి 60 మంది వరకు కార్యకర్తలు సమావేశంలో పాల్గొని సభను విజయవంతం చేసారు.

**- చీరాల ప్రతినిధి**

**వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60
Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.

[illegible]

## దాసమయ్య అవార్డు గ్రహీత మాచర్ల మోహనరావు అభినందన సభ

15-10-2013న చీరాల జాండ్రపేట సెంటర్‌లో సాయంత్రం 6 గం॥లకు చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో దాసమయ్య అవార్డు గ్రహీత మాచర్ల మోహనరావుకు అభినందన సభ జరిగింది. దేశంలో చేనేత రంగంలో గత 20 సం॥ల కాలంగా పనిచేస్తూ, రాష్ట్ర వ్యాపితంగా దేశంలోని వివిధ రాష్ట్రాలలో చేనేత రంగం వారిని సమీకరించి ప్లానింగ్ కమీషన్‌తో అనేక విధానపరమైన సూచనలు చేస్తూ కృషి చేసిన మాచర్ల మోహనరావుని కర్ణాటకలోని 'దేశీ సంస్థ దాసమయ్య ట్రస్టు' 50 వేల రూపాయల అవార్డును ప్రముఖ కన్నడ రచయిత ద్వారా అక్టోబరు 2న బెంగుళూరులో ప్రదానం చేసారు.

చేనేత జన సమాఖ్య ఆవిర్భావ రోజు 15-10-2013న మాచర్ల మోహనరావును వివిధ రంగాల ప్రముఖులు, రాజకీయ నాయకులు, మాచర్ల మోహనరావు సేవలను గుర్తుచేసి అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ నుండి లోకవిద్య ప్రపంచం సంపాదకులు టి. నారాయణరావు, చేనేత నిపుణులు కె.జె. రామారావు, నిజాం కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, కేంద్ర చేనేత బోర్డు సభ్యుడు తడక యాదగిరి, ప్రముఖ చేనేత నాయకులు, ప్రసంగించారు.

**మీకు తెలుసా!**

**పెట్రోల్ ధరలు వివిధ దేశాల్లో (లీటరుకు)**

| | | | |
|---|---|---|---|
| పాకిస్థాన్ | - రూ. 26/- | బర్మా | - రూ. 30/- |
| బంగ్లాదేశ్ | - రూ. 22/- | ఆఫ్గానిస్తాన్ | - రూ. 36/- |
| క్యూబా | - రూ. 19/- | శ్రీలంక | - రూ. 34/- |
| ఇటలీ | - రూ. 14/- | ఇండియా | - రూ. 82/- |
| నేపాల్ | - రూ. 34/- | | |

- తటవర్తి నారాయణరావు

## విద్యుత్ రంగం పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలి

కుటీర పరిశ్రమల నుండి భారీ పరిశ్రమలు వరకు, గృహోపయోగం నుంచి పొలానికి నీళ్ళవరకు, స్కూళ్ళ నుండి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల వరకు ప్రతీక్షణం అవసరంపడేది నేడు విద్యుత్. గాలి, నీరు, తిండి, బట్ట తరువాత వైద్యం, విద్య ప్రధాన స్థానాల్లో ఉండేవి. ఈనాడు ప్రతీ పనికి ఆఫీసు రికార్డుల దగ్గర నుండి, రైళ్ళు నడవడం దగ్గర నుండి బహుళ అంతస్తుల భవనాల్లో జీవించడం దగ్గర నుండి, పట్టణ నీటి సరఫరా దగ్గర నుండి వైద్యాలయాల్లో ఆపరేషన్ల కోసమైతేనేమి, విద్యుత్ లేనిదే మానవ మనుగడ అసాధ్యం.

విద్యుత్ ఉత్పత్తి రంగంలో - ప్రవహించే నీళ్ళ దగ్గర యంత్రాలు అమర్చి, బొగ్గును మండించి, అణువిస్ఫోటనం చేసి, గ్యాస్ మండించి చేసే విద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలు పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలో ఉండేవి. వీటికి కావలసిన పెట్టుబడులు సరిపోవడం లేదనే సాకుతో ప్రైవేటురంగం నుండి కొన్ని వేలకోట్ల పెట్టుబడితో నూతన ఉత్పత్తిని ప్రారంభించిన ప్రైవేటు సంస్థలకు ప్రజలనుండి లక్షలకోట్లు వసూలుచేసి ప్రభుత్వం యివ్వడం జరుగుతోంది.

స్థానికంగా గోబర్‌గ్యాస్ ప్లాంట్లు, సోలార్ ఎనర్జీ ప్లాంట్లు, గాలిమరల ప్లాంట్లు మొదలైనవి విద్యుత్ ఉత్పత్తికి పనికొస్తాయని తెలిసినా దీనికి కావలసిన స్థానిక పెట్టుబడుల కొరత, సాంకేతిక నిపుణుల కొరత, అవగాహన రాహిత్యం, మౌలిక సదుపాయాల అత్యంత ఖరీదైన లభ్యతల కారణంగానూ, ఉత్పత్తిపై ప్రభుత్వ సీత కన్నువేయటంవలన అవి బహుళ ప్రాచూర్యం పొందలేదు. ప్రత్యామ్నాయ స్థానిక ఈ ఉత్పత్తుల ద్వారా స్థానిక అవసరాలకూ, సుదూరాలకూ విద్యుత్ సరఫరా వేయటంవలన వచ్చే నష్టాలను తగ్గించవచ్చుననే అవగాహనా రాహిత్యం వలన ప్రభుత్వం ఈ రంగాన్ని విస్మరించింది. దీనితో ప్రజల మీద ప్రతీ మూడు నెలలకు, అధిక ధరల భారం మోపుతోందని, ఇటువంటి ప్రభుత్వాన్ని మార్చి విద్యుత్ ఉత్పత్తి రంగాన్ని మొత్తంగా ప్రభుత్వమే ఒక పాలసీగా తీసుకోవాలని, ప్రైవేటు వ్యక్తులకు ఈ రంగంనుండి తప్పించి ప్రజలకు లక్షల కోట్ల ఆదాచేసే నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని విశ్వసించడం నేటి ప్రజల కర్తవ్యం.

- సునీల్ సహస్రబుద్ధేతో నారాయణరావు

మా సంస్థ గురించి మరియు పాత పత్రికల గురించి చూడవల్సిన
వెబ్ పేజీ : Loka Vidya blogspot vidyaashram
**http : // www.vidyaashram.org/lokavidya_prapancham.html.**
**http : // vidyaashram.org/papers/LJA-Announcement_Telugu.pdf**

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
**Loka Vidya Prapancham**
**D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters,**
**Saroornagar (M), R.R. Dist. A.P.- 500 060 Ph : 040-24152155**
**e-mail : tnrkoundinyasa@yahoo.com**

**BOOK - POST PRINTED MATTER**
**16 NOVEMBER - 2013**

**To**

**Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Behind Shivaganga Theaters, Saroornagar (M), R.R. Dist. A.P.- 60**
**Printed at : M/s Print Point, H.No. 5-14, Opp. Megha Theatre lane, Durganagar, Dilsukhnagar, R.R. Dist. A.P.-500 060.**